క్లుప్తంగా

ఉత్తమ ఎంఈఓగా నోముల రంగయ్య

రాయపర్తి : మండలంలోని కొత్తూరు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న నోముల రంగయ్య ఉత్తమ ఎంఈఓగా ఎంపికయ్యారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి చేతుల మీదుగా శుక్రవారం ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఉత్తమ ఎంఈఓగా ఆయన ఎంపికవడం పట్ల మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ శాంతికుమార్‌కు అవార్డు

నర్సంపేట : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో జిల్లా ఎంసీ మెంబర్‌గా అందిస్తున్న సేవలను గుర్తింపుగా నాడెం శాంతికుమార్‌ను ప్రశంసనీయ సేవ గుర్తింపు అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా శాంతికుమార్ అవార్డు అందుకున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


కద్దూరి బాబు (ఫైల్)

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఎస్సై భరత్ కథనం ప్రకారం.. మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన కద్దూరి బాబు (27) గూడ్స్ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతీరోజు ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడంటూ తల్లి పద్మ ఈనెల 21న మందలించడంతో బాబు అదే రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లికి చెందిన లాసాని కిషన్ రెండ్రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పాలాయి శ్రీనివాస్, ఒలిగె నర్సింగరావు, మాదాసి సాంబయ్య, బొమ్మినేని భరత్‌రెడ్డి, కొల్లూరి రాజు, సుకినె నాగరాజు, అసోల సురేశ్, జిల్లెల్ల శ్రీనివాస్, ఉత్తరేణి రాజబాబు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని పోచమ్మవాడకు చెందిన రుద్రారపు వాణి శుక్రవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక కౌన్సిలర్ పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎదురబోయిన రామస్వామి, వలస సత్యం, అరపెల్లి బాబు, దాసి గోపీ, గ్యార శ్రీకాంత్, శ్రీరామోజు రాము, పస్తం హనుమంతు, పస్తం రాము, అరపెల్లి కిరణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లికి చెందిన కొలగాని సంపత్ ఇటీవల మృతి చెందగా అతడి సతీమణికి అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు శుక్రవారం రూ.26 వేల సాయం అందజేశారు. సంపత్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంపత్ స్నేహితులు కుసుంబ రఘుపతి, పాడేటి శ్యాంబాబు, రాజేందర్ పాల్గొన్నారు.

దాతల సాయం

కొత్తగూడ: ఇటీవల అగ్ని ప్రమాదలలో నష్టపోయిన కిష్టాపురం గ్రామస్తుడు బంగారి సమ్మయ్య కుటుంబానికి జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో దాతలు అందించిన పలు వస్తువులు, నిత్యావసర సరుకులను సర్పంచ్ మల్లెల రణధీర్ అందజేశారు. కార్యక్రమంలో పూల యాదగిరి, మల్లెల రాము, వెలుదండి వేణు, గుమ్మడి సమ్మయ్య, రాజం సారంగం, గట్టయ్య పాల్గొన్నారు.

ఊరూరా గణతంత్ర వేడుకలు

నర్సంపేట : కాంగ్రెస్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి


నర్సంపేట : మున్సిపల్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్లు


నర్సంపేట రూరల్ : ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగురేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, ప్రధాన కూడళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు జెండా ఎగరేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


నర్సంపేట రూరల్ : కోర్టులో..


పర్వతగిరి : తహసీల్దార్ కార్యాలయంలో..


వర్ధన్నపేట : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


వర్ధన్నపేట : మున్సిపల్ కార్యాలయంలో..


నల్లబెల్లిలో..


ఖానాపురంలో..


చెన్నారావుపేట : గ్రామ పంచాయతీలో..


దుగ్గొండి : పోలీస్‌స్టేషన్‌లో..


పర్వతగిరి : కల్లెడ పీఏసీఎస్‌లో..


నెక్కొండ: తహసీల్దార్ కార్యాలయంలో..


రాయపర్తి : అమరవీరుల స్తూపం వద్ద..

పట్టభద్రుల ఓటు నమోదు కీలకం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవడం కీలకమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఓటరు నమోదు డివిజన్ కన్వీనర్‌గా పబ్బతి సతీశ్‌రెడ్డిని, మండల ఇన్‌చార్జ్‌గా గందు రమేశ్‌బాబు నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో సతీశ్‌రెడ్డిని, రమేశ్‌బాబును ఎమ్మెల్యే అభినందించి మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు గడచిన ప్రతీఒక్కరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేలా యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు. అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ చూపాలని చెప్పారు. అనంతరం సతీశ్‌రెడ్డి, రమేశ్‌బాబు మాట్లాడారు. తమకు కేటాయించిన పరిధిలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా శక్తివంచన లేకుండా పని చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలిచే దిశగా పాటుపడతామని తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


డివిజన్ కన్వీనర్, మండల ఇన్‌చార్జ్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఫిబ్రవరి 6లోగా..

ఖానాపురం : మండలంలోని పట్టభద్రులు ఫిబ్రవరి 6లోగా ఆన్‌లైన్‌లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 1600 మంది ఓటు నమోదు చేసుకోగా ప్రస్తుతం 350 మంది మాత్రమే నమోదు చేసుకున్నట్టు తెలిపారు. గతంలో నమోదు చేసుకున్న పట్టభద్రులు సైతం మళ్లీ నమోదు చేసుకోవాలని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- రేపు జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం
- ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి

నెక్కొండ : రేపు (ఆదివారం)మండల కేంద్రంలోని విద్యోదయ హైస్కూల్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యోదయ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులకు అత్యుత్తమ విద్యాబోధన అందించడానికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడానికి పాటుపడుతున్నట్టు చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా, ప్రభుత్వం సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలను ఎజెండాగా సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తోపాటు అసోసియేషన్ రాష్ట్ర నేతలు హాజరవుతారని తెలిపారు. సమావేశానికి ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి నాసం సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు వంగల రాధాకృష్ణ, నాయకుడు కే.అశోక్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

నర్సంపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని స్థానిక టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. పట్టణంలోని విజడమ్ హైస్కూల్, ప్రీస్కూల్‌లో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన క్రీడాపోటీలకు ముఖ్యఅతిథులుగా సీఐ రవికుమార్, ఎస్సై రవియాదవ్, ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం, సెక్టోరియల్ ఆఫీసర్ సారయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నాజియా ఇక్బాల్, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఇన్‌చార్జ్‌లు హారిక, రవీందర్, అరుణ, రమాదేవి, మాధవి, అనిత, వీరభద్రయ్య, ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, పీఈటీలు రియాజ్, రాజేశ్, భద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కరెన్సీపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి'

వర్ధన్నపేట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీపై ముద్రించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ చిత్రాన్ని జాతీయ జెండాపైనా ముద్రించి ఆయనకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించాలని సూచించారు. అలాగే పట్టణంలో జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే నాగరాజు చొరవ చూపాలని కోరారు. కరెన్సీ నోట్లపై, జాతీయ జెండాపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించకుంటే ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సమావేశంలో నాయకులు మదన్, బరిగెల బాబు, కంజర్ల సమ్మయ్య, వేణు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుమ్మల కుమారస్వామి

ప్రజలందరికీ అందుబాటులో ఉంటా..


పెద్దవంగర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


పెద్దవంగర: ప్రజలందరికీ అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి పలు గ్రామాల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. తొర్రూరు మండలంలోని గుర్తూరులో తమ చారిటబుల్ ట్రస్టు ద్వారా 74 ఎకరాల్లో అన్ని వసతులతో కూడిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ రెడ్డి, మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు, దుంపల కుమారస్వామి, పొడిశెట్టి సైదులు, ముత్యాల పూర్ణచందర్, తోటకూర శ్రీనివాస్, రంగు మురళీగౌడ్, అనపురం శ్రీనివాస్, సీతారాం నాయక్, యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ, మహిళా మండల అధ్యక్షురాలు దేవేంద్ర, రంగు అశోక్, మహేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి కోరారు. మండలంలోని కర్కాల గ్రామానికి చెందిన నిరుపేదలైనా చిదిరాల సోమలక్ష్మి, కమలమ్మ కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందించి ఆదుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను అవమానించడం సరికాదు

తొర్రూరు: గణతంత్ర వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు జాతీయ పతాకాన్ని అవమానించడం సరికాదని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మట్లాడారు. స్థానిక 100 ఫీట్ల ఎత్తు జాతీయ జెండా ప్రాంగణంలో నిర్వాహకులు జెండా ఆవిష్కరిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు జెండాను లాగి విధ్వంసం సృష్టించడం దారుణమన్నారు. సమావేశంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, నాయకులు శ్రీనివాసరావు, శంకర్, కాలునాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మార్కెట్ హమాలీలకు దుస్తుల పంపిణీ


నెక్కొండ : దుస్తులు అందజేస్తున్న కార్యదర్శి


పర్వతగిరి : షూ అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ


నర్సంపేట రూరల్ : ఐడీ కార్డులతో విద్యార్థులు


రాయపర్తి : బుక్స్ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


చెన్నారావుపేట : బహుమతులు ఇస్తున్న హఫీజ్

నెక్కొండ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో 63 మంది హమాలీలు, 8 మంది దడువాయిలు, 8 మంది కూలీలకు మార్కెట్ కార్యదర్శి సీహెచ్.కృష్ణమీనన్‌రావు రూ.1.60 లక్షల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ అల్లి జ్యోతిప్రకాశ్, ఏఎంఎస్ పోలేపాక భాస్కర్, మార్కెట్ సిబ్బంది పెండ్యాల శ్రీనివాస్, మహ్మద్ రహీంపాషా, దడువాయిలు నర్సయ్య, విజేందర్, సురేష్, హమాలీ సంఘం నాయకులు వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఎన్‌ఆర్‌ఐ వితరణ

పర్వతగిరి : మండలంలోని కొంకపాకలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ పేరాల పద్మావతి సుధాకర్‌రావు రూ.70 వేల విలువైన లైబ్రరీ టేబుల్స్, అల్మారా, ర్యాక్, కుర్చీలు, కుట్టు మిషన్, విద్యార్థులకు షూ, లైబ్రరీ బుక్స్, రూ.10 వేల నగదు స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వర్కాల రమేశ్, హెచ్‌ఎం భిక్షపతి, ఎస్‌ఎంసీ చైర్మన్ సూర్ణ లింగయ్య మాట్లాడారు. ఏటా పాఠశాల విద్యార్థుల అవసరాలు తీర్చేలా ఆర్థికసాయం అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వెనిశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు విశ్వనాథ శర్మ, వెంకట్రాం నర్సయ్య, కుమారస్వామి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, సతీశ్‌కుమార్, రవీణ, లలిత, మమత, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డు, బెల్ట్, టైలు అందజేత

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని జెడ్పీ సెకండరీ స్కూల్ విద్యార్థులకు స్థానికుడు వడాల శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేల విలువైన ఐడీ కార్డులు, టైలు, బెల్ట్‌లు అందజేశారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కట్కూరి రాంరెడ్డి, వీరమల్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన బహుమతులు అందించారు.

ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

రాయపర్తి : మండలంలోని మైలారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తాను అదే పాఠశాలలో చదువుకుని వ్యాపారిగా ఎదిగినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్ లేతాకుల సుమతి యాదవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం తనయుడి దాతృత్వం

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మహ్మద్ హఫీజ్ అతడి తండ్రి అంకూస్ అలీ జ్ఞాపకార్థం రూ.20 వేల విలువైన బహుమతులు అందజేశారు. తానూ అదే పాఠశాలలో చదువుకున్నట్టు తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. హఫీజ్‌ను హెచ్‌ఎం జయ, సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ విజేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ కాసాని రవి, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు బాషుమియా అభినందించారు.

కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీపై హర్షం

నర్సంపేట : కూరెళ్ల విఠలాచార్యకు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో రవికుమార్ మీడియాతో మాట్లాడారు. విఠలాచార్య 6 దశాబ్దాలకుపైగా సాహితీ రంగంలో విశిష్ట సేవలు అందించడంతోపాటు ఇంట్లోనే 2014లో గ్రంథాలయాన్ని ప్రారంభించారని తెలిపారు. విఠలాచార్య స్ఫూర్తితోనే తాను నర్సంపేటలోని తన నివాసంలో లీడ్ లైబ్రరీ, లిటరరీ సెంటర్, లీడ్‌కార్ లైబ్రరీని, లీడ్ గ్రామీణ గ్రంథాలయాలను ప్రారంభించినట్లు చెప్పారు. విఠలాచార్యకు ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలు అనేక పురస్కారాలు అందించాయని తెలిపారు.

గెలుపోటములు సహజం : అరూరి


మాట్లాడుతున్న అరూరి రమేష్

ఐనవోలు : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి చేస్తామన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకం కలుగకుండా అభివృద్ధి పనులను కొనసాగించాలని అధికార పార్టీని కోరారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ న్యూస్‌లెటర్ వివేచన ఆవిష్కరణ


న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో న్యూస్ లెటర్ వివేచన 19వ వాల్యూం ఒకటవ ఇష్యూను పరిపాలన భవనం వద్ద వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్లు సదానందం, శ్రీనివాస్, కృష్ణమాచార్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ నర్సింహరావు, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.